క్లుప్తంగా

చేపపిల్లల సరఫరా బిల్లులు చెల్లించండి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ ద్వారా నిర్వహించిన ఉచిత చేపపిల్లల పంపిణీకి సంబంధించి సరఫరా బిల్లులు ఇప్పించాలని చేపపిల్లల ఉత్పత్తి రైతులు మత్స్యశాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్, ఏటికాడి ఆనంద్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆరేపల్లిలో చేపల పెంపకందారులు సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది రైతులకు రూ.74.16 కోట్ల బిల్లులు రావాల్సి ఉందని, పక్క రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి ఒక్క యూనిట్‌కు రూ.2.78 కాగా, తెలంగాణలో రూ.7.20 ఉందని అన్నారు. సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించి టెండర్లు నిర్వహించాలని కోరారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



వీపనగండ్ల: మండలంలోని వల్లభాపురంతండాలో ఆదివారం విద్యుదాఘాతంతో కట్రావత్ రాముడు అనే రైతుకు చెందిన కోడె మృతి చెందింది. పొలం పనుల నిమిత్తం వెళ్లిన కోడెలు సమీప పంట పొలంలో రైతు అమర్చిన సబ్‌స్టేషన్ ఎర్త్ గుంతలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు వాపోయాడు. మరణించిన కోడే విలువ రూ.80 వేలు ఉంటుందని, ప్రభుత్వ పరంగా తమను ఆదుకోవాలని బాధిత రైతు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టకపోతే ఆందోళన



వీపనగండ్ల: మండల కేంద్రంలోని పలు వార్డులు మురికి కూపాలుగా తయారయ్యాయని, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని సీపీఎం, పలు ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఆదివారం కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళి ఆధ్వర్యంలో పలు వార్డుల్లో వారు పరిశీలించారు. రైస్‌మిల్లు, ఎస్సీ కాలనీలో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతుందని, దళితవాడ, ఎస్టీ వాడలో డ్రైయినేజీలు లేకపోవడంతో ఈగలు, దోమలకు నిలయాలుగా మారి అంటువ్యాధులు ప్రబలే పరిస్థితులు నెలకొన్నాయని వాపోయారు. విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు అమర్చకపోవడంతో రాత్రివేళలో విషపు పురుగుల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయని, ఉన్నతాధికారులు వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆశన్న, ఈశ్వర్, రామకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావంతో పనిచేయాలి



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన బత్తుల విజయ్‌కుమార్‌యాదవ్ ఇటీవలే అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగం సాధించారు. దీంతో ఆదివారం మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు అతడిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత పాఠశాలలో విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాన్ని సంపాదించి ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారని మాజీ సర్పంచ్‌లు గంగిరెడ్డి, నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన మునిగౌండ అఖిల నీట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించడంతో అఖిలతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, కావలి మహేష్, గోపి పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

కొల్లాపూర్: హిందూ ధర్మపరిరక్షణకు కృషి చేయాలని భజరంగదళ్ నాయకులను ఆ సంఘం విభాగ్ సంయోజక్ సురేష్, సంయోజక్ చత్రపతిలు కోరారు. ఆదివారం పట్టణంలోని మాధవస్వామి దేవాలయ ఆవరణలో భజరంగ్‌దళ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. హిందూమతం గొప్పతనం, సంస్కృతీ, సంప్రదాయాల గూర్చి యువతకు తెలియజేయాలని వివరించారు. కార్యక్రమంలో సుంకరి పురేందర్, శివకృష్ణయాదవ్, రాజుయాదవ్, పులి భరత్, మహేష్, డీజే బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలేవీ

- ఇటీవల బస్సు దిగుతూ మహిళ మృత్యువాత
- కానరానీ సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు
- పరిమితికి మించిన వేగమే కారణం



మహిళ మరణించడంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న తాడిపర్తి గ్రామస్తులు (ఫైల్)

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో రోడ్డు ప్రమాదాలు నిత్యం ఏదో ఒకచోట చోటుచేసుకుంటున్నా నివారణ చర్యలు తీసుకోకుండా ఆర్ అండ్‌బీ అధికారులు చోద్యం చూస్తున్నారు. మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు, పీఆర్ శాఖల ఆధ్వర్యంలో కొత్తగా బీటీ రోడ్లు వేశారు. కానీ మూలమలుపుల్లో సూచికబోర్డులు, కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో వేగంగా వెళ్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడుతుండగా చాలామంది గాయాలపాలవుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోకుంటే మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్త చేస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి

ఉమ్మడి మండలంలో గతేడాది నుంచి ఇప్పటి వరకు ఆర్‌అండ్‌బీ, పీఆర్ పరిధిలో కొత్త రోడ్డు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని రోడ్డు రెన్యూవల్ చేశారు. రేవల్లి నుంచి గోపాల్‌పేట వరకు 19 కిలో మీటర్ల రోడ్డు పూర్తి అయింది. గోపాల్‌పేట నుంచి చెన్నూరు వరకు ఉన్న బీటీ రోడ్డు రెన్యూవల్ చేశారు. చాకల్‌పల్లి సమీపంలో నుంచి కేశంపేట పాతతండా వరకు బీటీ రోడ్డు వేశారు. ఇలా మండలంలో చాలా వరకు కొత్త రోడ్లు వేశారు. కానీ స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు వేగంగా వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. గతేడాది నవంబర్ 27న రాత్రి వనపర్తి నుండి బుద్దారం వైపు ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వెళ్తుండగా ఓ కంటెయినర్ వాహనం ఢీకొట్టడంతో శ్రీహరి అనే యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. అదే ప్రమాదంలో మరో యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. బుద్దారం గ్రామానికే చెందిన ఏఆర్ కానిస్టేబుల్ శివకుమార్ డిసెంబర్ 28న రాత్రి సమయంలో బుద్దారం నుంచి వనపర్తి వెళ్తుండగా బుద్దారం శివారులో మలుపు వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కరెంటు పోల్‌కు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. ఏదుట్ల, గోపాల్‌పేట మధ్యలో ఇద్దరు, చీర్కపల్లి సమీపంలో ఇద్దరు వ్యక్తులు బైకుపై అతివేగంతో వెళుతూ కిందపడి మరణించారు. తాడిపర్తిలో చెన్నారం గ్రామానికి చెందిన ఓ మహిళ బస్సు దిగుతూ కిందపడి గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించింది. మరుసటిరోజు గ్రామంలో బస్ స్టాపు ఏర్పాటు చేయాలని, గ్రామంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ధర్నాకు దిగారు. సంవత్సర కాలంలో సుమారు పదిమంది వరకు మరణించారు. ఇరవైమందికి పైగా గాయాలపాలయ్యారు.

అన్యాయంగా మా అక్క మరణించింది



చెన్నారం గ్రామానికి చెందిన మా అక్క చెన్నారం నుంచి తాడిపర్తి గ్రామానికి వస్తూ బస్సు దిగుతూ కిందపడి మరణించింది. రోడ్లపైన డ్రైవర్లు ఎక్కువ స్పీడుతో నడపడం, ఆర్టీసీ బస్సులు ప్రయాణికులు దిగకముందే మళ్లీ ముందుకు తీసుకుపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. తాడిపర్తి గ్రామంలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– సురేందర్, తాడిపర్తి

పనులు ప్రారంభిస్తాం

వనపర్తి డిగ్రీ కాలేజీ నుంచి బుద్దారం గండి సమీపంలో ఉన్న జిల్లా సరిహద్దు వరకు, జిల్లా వ్యాప్తంగా సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు ఇతర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయ్యాయి. తొందర్లోనే పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం.

– దేస్యానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ, వనపర్తి జిల్లా

అటెన్షన్ ప్లీజ్

‘భగీరథ’కు తూట్లు



గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదుల గ్రామంలోని 2 వార్డులో నాలుగు నెలలుగా మిషన్ భగీరథ పైప్లైన్ లీకేజీ అయి తాగు నీరు వృథాగా పోతున్నా అధికారులకు పట్టడం లేదు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నీటి వృథాను అరికట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

– వనపర్తి

శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

ఆత్మకూర్: మాంసాహారం తినడం ద్వారా ఎన్నోరకాల అనారోగ్య సమస్యలు వస్తాయని, శాకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో సిద్ధిస్తుందని పిరమిడ్ ధ్యాన మాస్టర్ బంగ్లా ఆంజనేయరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మసాయి పిరమిడ్ ధ్యాన మందిర ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పురవీధుల గుండా వేలాది మంది ధ్యానులు భారీ శాకాహార ర్యాలీ నిర్వహించారు. ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని, రెండు చేతులు జోడించి కళ్లు మూసుకుని సహజసిద్ధంగా ఉచ్వాస, నిచ్వాసలపై ధ్యాస పెట్టాలని సూచించారు. ధ్యానం వల్ల సర్వ రోగాలు దూరమై, ప్రశాంతత చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాధాకృష్ణారెడ్డి, శివరాములు, శ్రీనివాస్‌గౌడ్, రఘుపతిరెడ్డి, పల్లవి, మంజుల, వెంకటేష్, రాజు, గోపాల్, విష్ణు, సాయిచంద్, గురువచారి వెంకటేష్ ఉన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



అమరచింతలో స్నేహితుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మిత్ర బృందం

అమరచింత: స్నేహితుల దినోత్సవం రోజే తమ స్నేహితుడు అనారోగ్యంతో మృతి చెందడంతో తోటి స్నేహితులు తమ వంతు ఆర్థికసాయం అందిస్తూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. పట్టణానికి చెందిన తెలుగు తిరుమలేష్(46) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. శనివారం రాత్రి మృతి చెందాడు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదివిన మిత్రబృందం మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులకు రూ.36 వేల నగదును అందిచారు. కార్యక్రమంలో తాటికొండ రమేష్, హర్షవెంకటేష్, ముష్టి శ్రీను, జాల్గి నరసింహులు, శఫయాత్, ఖదీర్, విష్ణువర్ధన్, అక్బర్‌అలీ, దుబాయ్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన మంగలి పెద్ద కురుమన్న అనారోగ్యంతో మృతిచెందాడు. విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి రూ.5వేలు ఆర్థికసాయం పంపించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పంపిన రూ.5వేలతో పాటు మాజీ సర్పంచ్ జానకి కొండన్న రూ.2వేలు బాధిత కుటుంబానికి అందజేశారు

చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలి



పాన్‌గల్: మండలంలోని పలు గ్రామాల గుండా ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వ ద్వారా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రైతులు కోరారు. వానాకాలం సీజన్ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా నేటికీ కొత్తపేట, దొండాయిపల్లి గ్రామాల రైతులకు కేఎల్ఐ కాల్వ ద్వారా సాగునీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాల్వకు సమీపంలో ఉన్న ఎగువ గ్రామాల నుంచి ప్రవహించే సాగునీరు సాఫీగా చివరి ఆయకట్టు రైతులకు చేరకుండా రాళ్లు, మోటార్లు వేసుకోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు చేరని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెవెళ్లినా ఏమాత్రం పట్టించుకోకపోవడంతో చివరి ఆయకట్టు పొలాల్లో వరి నాట్లు వేయని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కాల్వపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేస్తూ సాగునీరు చివరి ఆయకట్టు వరకు సాఫీగా చేరేలా తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని ఆయా గ్రామాల రైతులు తెలిపారు.

లక్ష్మణ్‌నాయక్‌కు సన్మానం



లక్ష్మణ్‌నాయక్‌ను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

వనపర్తిటౌన్: వృత్తి ధర్మాన్ని చిత్తశుద్ధితో పాటించే నిబద్ధత గల అధికారి లక్ష్మణ్‌నాయక్ అని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. పాన్‌గల్ మండల విద్యాశాఖ అధికారిగా 14 ఏళ్ల విధులు నిర్వహించిన లక్ష్మణ్‌నాయక్ రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌కు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆయనను సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో విలువల కోసం కట్టుబడి ఎన్ని ఇబ్బందులు ఎదురైన ప్రభుత్వ ఆదేశానుసారం నిజాయితీగా పనిచేసి ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధుల మన్ననలు అందుకున్నాడని కొనియాడారు. పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు విద్యాశాఖ అధికారిగా సుదీర్ఘకాలంగా సేవ చేశారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, గణేష్, జీసీడీఓ శుభలక్ష్మి, ఉపాధ్యాయులు బైరోజు చంద్రశేఖర్, నిరంజనయ్య, స్వామి, గంధం నాగరాజు, శ్రీనివాసులు, మోహన్, జగన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



తెల్లరాళ్లపల్లితండాలో సమస్యలపై ఆరా తీస్తున్న గిరిజన సంఘం బృందం సభ్యులు

పాన్‌గల్: మండలంలోని గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండా, శాగాపూర్‌తండా, అన్నారంతండా, దొండాయిపల్లితండా, గోప్లాపూర్‌తండా, కిష్టాపూర్‌తండాల్లో గిరిజన సంఘం బృందం పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఆయా తండాల్లో ముఖ్యంగా పోడు భూముల సమస్యలు, గిరిజన కార్పొరేషన్ రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వకపోవడం, సారా తయారీ మానేసిన వారికి రుణాలు ఇవ్వకపోవడం, పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, అర్హులకు పింఛన్లు, రోడ్డు సౌకర్యం, ప్రజారవాణా, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారంపై ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బాబునాయక్, ధర్మనాయక్, సోమ్లానాయక్, కృష్ణనాయక్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా నిధులు విడుదల చేయాలి



కొల్లాపూర్: వానాకాలం సంబంధించిన రైతుభరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావొస్తున్నా ఇప్పటివరకు రైతుభరోసా అమలు చేయలేదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు నాయకులు మహేష్, రాజుయాదవ్, శ్రీనివాసులు తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఆత్మకూర్: బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం రాత్రి ఆత్మకూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాలు ప్రకారం.. పట్టణానికి చెందిన వడ్డె రాజు, నర్సింహ బైక్‌పై మదనపూర్ నుంచి ఆత్మకూర్‌కు వస్తుండగా పరమేశ్వరస్వామి చెరువు కట్ట సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. నర్సింహ తలకు దెబ్బ తగిలి పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పెబ్బేరుకు చెందిన కారు, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



పెద్దమందడి జెడ్పీహెచ్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

కొత్తకోట రూరల్: 17ఏళ్ల వయస్సులో విడిపోయిన వారు 29ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకొని ఆనందోత్సవంలో మునిగిపోయారు. 1994–95 విద్యా సంవత్సరంలో పెద్దమందడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ‘స్నేహితుల దినోత్సవం’ సందర్భంగా కలుసుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్నప్పుడు తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు శివరాజలింగం, కృష్ణయ్య, సత్యనారాయణశెట్టిని పూలమాలు వేసి శాలువాలతో సత్కరించారు.

ఆత్మకూర్: అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మకూర్‌లో స్థానిక గాంధీచౌక్‌లో స్నేహితుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మాట్లాడుతూ యువత స్నేహభావంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో యూనూస్, రవి, వసీం, జిలాని, మహిమూద్, చరణ్, ఖాజ, ఇమామ్, పాషా, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో..

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయమే పాఠశాలకు చేరుకున్న 60 మంది పూర్వ విద్యార్థులు యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

వాతావరణ సమతుల్యం కాపాడాలి



పాములపై అవగాహన కల్పిస్తున్న కృష్ణసాగర్

చిన్నంబావి: వర్షాకాలంలో పాములతో జాగ్రత్తగా ఉండాలని, పాముకాటు వేస్తే నాటు మందులు వాడకుండా.. ప్రభుత్వ ఆస్పత్రిలో పాముకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని స్నేక్ సొసైటీ సభ్యుడు కృష్ణసాగర్ అన్నారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన శివసాగర్ పిలుపు మేరకు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. వాతావరణంలో సమతుల్యం తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. అదేవిధంగా మండల ప్రజలు ఎక్కువ శాతం కృష్ణానది పరివాహక ప్రాంతం కావడంతో పాములు, మొసళ్లు వంటి జంతువులు ఎక్కువగా సంచరిస్తుంటాయని, అవి కనిపిస్తే భయపడకుకండా.. తమకు సమాచారం అందించాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో ఇంకా మూఢనమ్మకాలు, నాటు మందులు వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాణి, స్నేక్ సొసైటీ సభ్యులు గోపాల్, ధర్మేందర్, కుమార్, లోకేష్, నవీన్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు



పెబ్బేరులో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: అమావాస్యను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రధాన ఆలయాల్లో ఆదివారం అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెబ్బేరు పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దర్శించుకున్నారు. ఆత్మకూర్ మండలంలోని మల్లాపురం క్షేత్రంలోని ఆంజనేయ, లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో, ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద, అమరచింత మండలంలోని చంద్రగఢ్‌కోటపై వెలసిన శివాలయంతో పాటు నాగల్‌కడ్మూర్‌లోని దేవేంద్రచారి మఠం, అమరచింతలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల చౌడేశ్వరిదేవి ఆలయంలో, నపర్తి మండలంలోని అచ్చుతాపురం శివారులోని గుంటి పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో దాతలు సహకారంతో నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వేదపండితుడు వెంకటశేషశర్మ, కమ్మరి గోపి, మురళీధర్‌రెడ్డి, పద్మ దంపతులు, శంకర్‌రెడ్డి, లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.



తూంకుంట చౌడేశ్వరి ఆలయంలో..



అచ్యుతాపురంలో..



ఖిల్లాఘనపురం వీరభద్రస్వామి ఆలయం వద్ద..

నిత్యావసర సరుకుల పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని నార్లాపూర్‌లో ఇటీవల తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన ముగ్గురు ఆడపిల్లలకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు రమేష్ ఆదివారం బీజేపీ నాయకులతో కలిసి వారి కుటుంబాన్ని సందర్శించారు. అనంతరం వారికి రూ.10వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ధనుంజయ గౌడ్, కాశిపురం మహేష్, మెంటే శివకృష్ణ, కురుమయ్య, సురేందర్, అశోక్, జగపతిరావు, యాదమ్మ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

కొల్లాపూర్: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన వరదలకు ప్రాణాలు కోల్పోయిన, క్షతగాత్రుల సహాయార్థం సీపీఎం నాయకులు పట్టణంలో ఆదివారం విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు పాల్గొని మాట్లాడారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. శివవర్మ, నాయకులు బాలపీరు, జల్లాపురం సురేందర్, రాముడు, బత్తిని రాజు, బాలునాయక్ ఉన్నారు.